క్లుప్తంగా

ఘనంగా చర్చి వార్షికోత్సవం



దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ చర్చి 4వ వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. సంఘ పాస్టర్ రెవరెండ్ గనుపల్లి శ్యాం ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పల్నాడు జిల్లాలోనే ఈ చర్చికి ప్రత్యేకత ఉందని తెలిపారు. రూ. కోట్ల వ్యయంతో ఈ చర్చిని సుందరంగా తీర్చిదిద్దారని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఎఎల్సీ డెలిగేట్ వినుకొండ బాబు, చర్చి డెలిగేట్ శ్రీపతి కాశయ్య, పీసీసీ మెంబర్లు, సంఘపెద్దలు, సంఘస్థులు పాల్గొన్నారు.

ఎంఈవో నాగయ్య సేవలు ప్రశంసనీయం

రెంటచింతల: విద్యారంగంలో అంకితభావంతో 21 ఏళ్లపాటు విధులు నిర్వహించిన ఎంఈవో వేముల నాగయ్య సేవలు ప్రశంసనీయమని రెంటచింతల ఎంఈవో-2 వై. శివనాగేశ్వర రావు అన్నారు. గురువారం రాత్రి స్థానిక ఎంఈవో కార్యాలయంలో నాగయ్యకు వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. నాగయ్య తన సేవలతో జిల్లా ఉన్నతాధికారుల మన్ననలు కూడా పొందారన్నారు. మూడు సార్లు జిల్లా ఉత్తమ ఎంఈవోగా పురస్కారం పొంది ఆదర్శంగా నిలిచారని తెలిపారు. అనంతరం వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు నాగయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డా.ఎంబీ చిన్నమ్మ, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ పాపయ్య, హెచ్ఎంలు కె. నాగేశ్వర రావు, కె. వెంకటేశ్వర రావు, సీహెచ్ నాసరయ్య, వెన్నా బుచ్చిరెడ్డి, బేబిరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన చట్టాలను రద్దు చేయాలి

గురజాల : జిల్లా న్యాయవాదుల ఫెడరేషన్ పిలుపు మేరకు శుక్రవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాలను సత్వరమే రద్దు పరచాలని డిమాండ్ చేశారు. స్థానిక కోర్టు భవనాలలో శనివారం ఈ మేరకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, కె. కాశీవిశ్వనాథం, అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరెడ్డి, కేవీ నాగార్జున, కర్రా చినకోటేశ్వర రావు, కత్తి చలమరాజు, కె ప్రభుదాసు, బీఎస్వీ హనుమంతరావు, కె.ఆదినారాయణ, వై.నరసింహారెడ్డి, తదితరులున్నారు.

బోనాల మహోత్సవాలకు సన్నాహాలు

పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీ నగర్‌లో వేంచేసియున్న శ్రీ కనక దుర్గ అమ్మవారి ఆషాఢ మాస బోనాల కార్యక్రమాలు త్వరలో నిర్వహించనున్నట్లు అర్చకులు రావూరి పూర్ణానంద శాస్త్రి తెలిపారు. 7వ తేదీ నుంచి ఐదు ఆదివారాలు, నాలుగు శుక్రవారాలు ఉత్సవాలు పేర్కొన్నారు. అమ్మవారికి చీర, జాకెట్, వడి కట్టు బియ్యం, పూలు, గాజులు, పసుపు కుంకుమతో బోనాన్ని సమర్పించి కృపకు పాత్రులు కావాలని ఆయన సూచించారు. శనివారం ఆషాఢ మాసం ప్రారంభం సందర్భంగా అమ్మవారికి లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణం జరుగుతుందని తెలిపారు. హాజరైన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేయనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి వారాహి నవరాత్రులు

కారెంపూడి : శ్రీవారాహి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు శనివారం నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయ అర్చకులు కొమండూరి సత్యనారాయణాచార్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నకేశవ స్వామి దేవాలయంతోపాటు, మిట్టమీద ఆంజనేయ స్వామి, శ్రీ కోదండ రామాలయం, వీరాంజనేయ స్వామి దేవాలయం, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయాలలో నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని అర్చకులు పేర్కొన్నారు.

పురుగు మందుల తయారీ కంపెనీల్లో తనిఖీలు



నాదెండ్ల: మండలంలోని పలు ఎరువులు, పురుగు తయారీ కంపెనీలను వ్యవసాయశాఖ రాష్ట్రస్థాయి అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. వ్యవసాయ కమిషన్ కార్యాలయ డీడీఏ సీహెచ్ శ్రీనివాసరావు, ఎం రామచంద్రయ్య, ఎస్ఐ ఒక బృందంగా, అలాగే విజయవాడ ఏడీఏ బి.వెంకటేశ్వరరావు, డీడీ రవికుమార్, విశాఖపట్నం విజిలెన్స్ ఎస్ఐ రెండో బృందంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సాతులూరు గ్రామంలోని పురుగు మందులు తయారీ కంపెనీ ముద్ర ఆగ్రో కెమికల్స్‌లో స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా లేనందున రూ. 3,54.142 విలువైన 11 రకాల పురుగు మందులను విక్రయించకుండా నిలుపుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు. నమూనాలను సేకరించాలని నాదెండ్ల ఏవోను ఆదేశించారు.

జాడ లేని వానలు.. రైతన్నకు దిగులు!

సాగు పనులు చేపట్టలేక అన్నదాతల్లో ఆందోళన



గురజాలలో విత్తనాలు నాటేందుకు సిద్ధం చేసిన పొలం

గురజాల : వానాకాలం వచ్చినా మబ్బులే తప్ప చినుకు జాడ మాత్రం కనిపించడం లేదు. నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల పరిధిలోని గ్రామాల్లో సరైన వర్షం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలైన తొలకరి కోసం రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతేడాది జూన్‌లో వర్షాలు కురిశాయి, దీంతో రైతులు ఖరీఫ్ సాగును ప్రారంభించారు. ఈ ఏడాది మాత్రం జూలై వచ్చినప్పటికీ సరైన వర్షం కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వారంలో కురిసిన వర్షాలకు వాతావరణం చల్లబడిందే కానీ పొలాలు మాత్రం పదును కాలేదని రైతులు అంటున్నారు. అంతేకాకుండా పగటిపూట ఉష్ణోగ్రత మాత్రం 38 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అవుతోంది. మండే ఎండలకు ఉక్కపోత తోడవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు వేసవి దుక్కులు దున్నుకుని విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు.

నత్తనడకన పనులు ....

గురజాల నియోజకవర్గంలోని మండలాల్లో సాగు పనులు నత్తనడకన సాగుతున్నాయి. వ్యవసాయాధికారుల సమాచారం మేరకు 62,500 ఎకరాలకు గాను ఇప్పటివరకు కేవలం 2,500 ఎకరాలు మాత్రమే సాగు చేశారు. వరి సాగు ప్రశ్నార్థకంగా మారనుందని ఆయా శాఖ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో నీరు పుష్కలంగా ఉంటేనే వరి సాగుకు అవకాశం ఉంటుందని లేకపోతే కష్టమని అంటున్నారు. బోర్లు, చెరువుల కింద మాత్రమే వరి సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది పోగాకు, కంది సాగుకు మక్కువ చూపుతున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోండి



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి తదితరులు

పిడుగురాళ్ల: డయేరియా ప్రబలకుండా అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ రవి తెలిపారు. పట్టణంలోని లెనిన్‌నగర్, మారుతీనగర్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... డెంగీ నివారణే తమ లక్ష్యమని సూచించారు. అలాగే ప్రతి ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అతిసార వ్యాధికి గురైన రోగులకు వైద్య సేవలను అందించాలని తెలిపారు. లెనిన్‌నగర్, మారుతీనగర్ ప్రాంతాల్లో రోగులను పరిశీలించి వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. పట్టణంలో అతిసార ప్రబలటంతో పట్టణ పరిసర ప్రాంతాల్లో వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. వైద్య సిబ్బంది తమ పరిధిలోని ప్రజలకు ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని, సత్వరమే వైద్య సేవలను అందించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా స్టాప్ డయేరియా కార్యక్రమం జరుగుతోందని, దీనిలోని భాగంగా ఆసుపత్రుల పరిధిలో వైద్య సిబ్బంది సర్వే నిర్వహించి అతిసార నివారణకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అతిసార నివారణలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్, అంటువ్యాధుల నివారణ జిల్లా పర్యవేక్షకులు సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్కేఎండీ మూసా ఖలీం, సీహెచ్‌వో హర్షవర్ధన్, సూపర్‌వైజర్లు జయబాబు, విజయకుమారి, హెల్త్ అసిస్టెంట్ రెహమాన్, మారుతీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు రవితేజ, మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ పి. రవీంద్ర బాబు, మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, మున్సిపల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాక్సిన్

గురజాల : శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాక్సిన్ వేయనున్నట్లు పశు వైద్యశాల ఏడీ నాగమల్లీశ్వరరావు తెలిపారు. పెంపుడు కుక్కలు, ఇతర జంతువులు ఉంటే వైద్యశాలకు తీసుకువచ్చి ఉచిత వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు.

వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రాజుపాలెం: పిల్లల్లో వాంతులు, విరోచనాలు ఉన్నట్లయితే.. వెంటనే వారికి జింక్ మాత్రలతో పాటు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలని హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌లో కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ ఉన్న ఆహారాన్ని తీసుకోరాదని స్పష్టం చేశారు. మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, వేడి పదార్థాలనే తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రవికుమార్, ఏఎన్ఎం తిరుపతమ్మ, ఆశ కార్యకర్త ప్రసన్న పాల్గొన్నారు.

ప్రకృతి సాగు పరిశీలన

నాదెండ్ల: ప్రకృతి వ్యవసాయం అధికారులు శుక్రవారం నాదెండ్ల మండలం సందర్శించారు. కృషి సఖీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా చిరుమామిళ్ల, చందవరం గ్రామాలలో పీఎండీఎస్ కింద సాగు చేసిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగు డీపీఎం కె.అమలకుమారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు ప్రధాన పంటకు ముందుగా వేసుకునే ప్రీమాన్సూన్ డ్రైసోయింగ్ (పీఎండీఎస్) కింద 30 రకాల విత్తనాలను వేసుకోవాలని సూచించారు. భూమిలో సూక్ష్మ జీవులు అభివృద్ధి చెంది జీవవైవిధ్యం ద్వారా నేల ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా యాంకర్ రామచంద్ర మాట్లాడుతూ ప్రధాన పంట పత్తిలో పీఎండీఎస్ విధానం అమలు చేయడాన్ని వివరించారు. బీజామృతం, విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం శివకుమార్, ఎస్ఎఫ్ఏలు, కృషి సఖీవీవో, యానిమెటర్లు, ఎంటీ మోడల్ మేకర్, గ్రామ సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో ఉచిత వైద్యశిబిరం

56 మంది న్యాయవాదులు, గుమస్తాలకు పరీక్షలు చేసిన వైద్య సిబ్బంది



నరసరావుపేట: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు ప్రాంగణంలో కొనాక్ డయాగ్నస్టిక్ సెంటర్ వారి సౌజన్యంతో ఉచిత డయాబెటీస్, ఆరోగ్య పరీక్షా శిబిరం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేదరమెట్ల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు అమూల్య, కార్యదర్శి అబ్బూరి ఏడుకొండలు పర్యవేక్షణలో 56 మంది న్యాయవాదులు, గుమస్తాలు, కోర్టు సిబ్బందికి మధుమేహం, రక్తపోటు, ఇతర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగితే మేలు



నీటి నమూనాలను సేకరిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, స్వచ్ఛ భారత్ మండల శాఖ ఉద్యోగులు శుక్రవారం గ్రామంలో డయేరియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురజాల రోడ్డు జంక్షన్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఎస్సీ కాలనీ వాసులకు పరిసరాల పరిశుభ్రత విషయమై అవగాహన కల్పించారు. ఇళ్ల ముందు మురుగు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలను స్వచ్ఛభారత్ ఎంసీఓ కె. సుబ్బారావు కోరారు. అలాగే కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. బోర్ల నుంచి రంగు మారిన కలుషిత నీరు వస్తున్నాయని గుర్తించిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఈ ప్రాంతంలోని బోర్ల నుంచి నీటి సమూనాలను అధికారులు సేకరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పి.సత్యప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నూతన మోటారు వాహన చట్టాన్ని రద్దు చేయాలి

సత్తెనపల్లి ఆర్డీఓ మురళీకృష్ణకు సీఐటీయూ వినతి



మురళీకృష్ణకు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

సత్తెనపల్లి: రవాణా రంగానికి పెను భారంగా మారిన నూతన మోటారు వాహన చట్టాన్ని రద్దు చేయాలని చేయుత ట్రాలీ ఆటో వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) పల్నాడు జిల్లా కార్యదర్శి ఎం.హరిపోతురాజు డిమాండ్ చేశారు. నూతన చట్టాలను రద్దు చేయాలని కోరుతూ చేయుత ట్రాలీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి ఆర్డీఓ వి.మురళీకృష్ణ కు, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిపోతురాజు మాట్లాడుతూ ఇప్పటికే అనేక భారాలతో సతమతమవుతున్న రవాణా రంగాన్ని కొత్తగా తీసుకొచ్చిన చట్టాలతో అధిక పెనాల్టీలు వేయటమే కాకుండా చిన్న, చిన్న తప్పులకు కూడా భారీ స్థాయిలో శిక్షలు వేయడానికి అనుకూలంగా ఈ నూతన చట్టాలు తీసుకొచ్చారన్నారు. ఆటో స్టాండ్‌లో పార్కింగ్ స్థలం ఆక్రమణ, వాహనదారుల వద్ద వసూలు చేస్తున్న ఆశీలు సమస్యల గురించి సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేశారు. 2020 నుంచి మెయిన్ రోడ్డులోని ఆర్ అండ్‌బీ బంగ్లాను అనుకొని ఉన్న ఖాళీ స్థలంలో అప్పటి మున్సిపల్ కమిషనర్, అప్పటి సీఐ అనుమతితో వాహనాలను పార్కింగ్ చేసుకుంటున్నామన్నారు. అయితే కొన్ని నెలలుగా కొలిమి కార్మికులు ఆటో పార్కింగ్ స్థలంలో పాకాలు వేసుకొని వారి వృత్తిని కొనసాగిస్తున్నారని, దీని వల్ల ఆటోల పార్కింగ్‌కు స్థలం సరిపోవటం లేదన్నారు. ఈ సమస్యపై కమిషనర్ షమ్మి స్పందిస్తూ ఆటో పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించుకున్న ప్రాంతాన్ని పరిశీలించవలసిందిగా టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారన్నారు. సరుకు లోడింగ్, అన్‌లోడింగ్ సమయాలలో వాహనదారుల నుంచి రుసుము వసూలు చేయమని తాము చెప్పలేదని, వాహనదారులు ఆశీలు వసూలు చేసే వారికి లోడింగ్, అన్‌లోడింగ్ సమయాల్లో ఎటువంటి రుసుం ఇవ్వొద్దని తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ సహాయ కార్యదర్శి జెడ.రాజ్‌కుమార్, యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.రాజేంద్ర, ట్రెజరర్ కె.పోలయ్య, సభ్యులు ఎస్.సైదేశ్వరరావు, బి.వీర్రాజు, టి అశోక్, కె.నాగేశ్వరరావు, ఒర్సు శ్రీను, జి నాగేశ్వరరావు, పల్నాటి వెంకటేశ్వర్లు, టి.వెంకట్రావు పాల్గొన్నారు.

● టిప్పర్లతో తిప్పలు!



టిప్పర్లతో ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈపూరు మండలం భద్రుపాలెం వద్ద క్వారీ, క్రషర్ల నుంచి కంకర, చిప్స్‌లు, పౌండర్ వంటి వాటిని వినుకొండ, కారంపూడి పరిసర ప్రాంతాల్లోని కాంట్రాక్టర్లకు సరఫరా అవుతాయి. ఈ నేపథ్యంలో వినుకొండ -కారంపూడితో పాటు ఇతర రహదారులపై ఆనుకొని ఉన్న గ్రామాలకు చెందిన ప్రజలు ఈ టిప్పర్ల వలన ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్ పైన మూసి వేయకపోవడంతో, టార్పాలిన్ పట్ట ఏర్పాటు చేయకపోవడంతో రహదారులపై నడిచే పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు అవస్థలు తప్పడం లేదని, అధిక లోడుతో పాటు అతివేగంగా టిప్పర్లు నడుస్తున్నాయని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం లోడ్‌తో ఉన్న టిప్పర్లను నడిచేలా చూడాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. -బొల్లాపల్లి

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అవసరం



పిడుగురాళ్ల: వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరికి అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి గీతాంజలి తెలిపారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు అందించే టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిల్వ ఉంచిన టీకాల రికార్డులను పరిశీలించారు. అధికారిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్యులు ప్రభావతి, రమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సరోజనీదేవి

మాచర్ల రూరల్ : వాతావరణ పరిస్థితులు మారిన నేపథ్యంలో గ్రామాలలో ప్రబలుతున్న అంటువ్యాధుల నివారణకు తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ సరోజనీదేవి ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి గ్రామంలో శానిటేషన్ పనులు చేపట్టాలని, ముఖ్యంగా మురికి కాలువలలో పూడికతీయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి నిర్దేశించిన ప్రదేశాలల్లో వేసేలా చూడాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బ్లీచింగ్, దోమల నివారణకు మందును చల్లించాలని ఆదేశించారు. డయేరియా నివారణలో కార్యదర్శులు ప్రత్యేక పాత్ర పోషించాలన్నారు. ప్రతి కార్యదర్శి విధిగా వారికి కేటాయించిన గ్రామంలో రోజూ పర్యటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు బిట్టు వెంకటేశ్వర్లు, ఎల్లబోయిన కోటేశ్వరరావు, పాలవాయి వెంకట్రామయ్య, టీపీ సత్యనారాయణ, బాబులాల్ నాయక్, విజయ్ పాల్గొన్నారు.

రైలుకు హాల్టింగ్ వసతి కల్పించాలని వినతి



డీజీఎంకు వినతి పత్రాన్ని అందజేస్తున్న జెడ్ఆర్‌యూజీసీ సభ్యులు

పిడుగురాళ్ల: రేపల్లె – సికింద్రాబాద్ రైలు ప్రయాణికుల సౌకర్యార్థం పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని పిడుగురాళ్ల పట్టణానికి చెందిన దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సంప్రదింపుల కమిటీ సభ్యులు మద్దాలి సుబ్బయ్య శుక్రవారం కోరారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ. శ్రీధర్‌కు వినతి పత్రాన్ని అందించారు. శుక్రవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలోని ఆయన కార్యాలయంలో మద్దాలి సుబ్బయ్య, దక్షిణ కోస్తా రైల్వే ప్రయాణికుల సంఘం విజయవాడ డివిజన్ కార్యదర్శి రౌతు లీలాధర్‌లు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. తాము జెడ్ఆర్‌యూజీసీ 75వ సమావేశంలో సమస్యలను రైల్వే జీఎం దృష్టికి తీసుకొచ్చామని, తమ ప్రాంత ప్రజాప్రతినిధులు, పార్లమెంట్ సభ్యులు సైతం వీటిని లేవనెత్తారని గుర్తుచేశారు. రైల్వే మంత్రికి, రైల్వే బోర్డు చైర్మన్‌కు కూడా విజ్ఞప్తి చేశామన్నారు. పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో కరోనాకు ముందు రేపల్లె డెల్టా ప్యాసింజర్ నిలుపుదల ఉండేదని తెలిపారు. ఇప్పుడు ఆ సౌకర్యం లేక ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

నేడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు



మండల పశువైద్య అధికారి షేక్ బషీర్

రెంటచింతల: జూలై 6న ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం స్థానిక పశువైద్యశాలలో కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి షేక్ బషీర్ అన్నారు. శుక్రవారం స్థానిక పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను అప్రమత్తం చేస్తూ వారికి అవగాహన కల్పించడమే జునోసిస్ డే ప్రధాన ఉద్దేశమన్నారు. సుమారు 180 రకాల వ్యాధులు పశుపక్ష్యాదుల నుంచి మనుషులకు సంక్రమిస్తాయన్నారు. పశు వైద్యులకు, రైతులకు, వధశాల కార్మికులకు, పెంపుడు జంతువులతో సన్నిహితంగా ఉండేవారికి రేబీస్, ఆంత్రాక్స్, బ్రుసుల్లోసిస్, క్షయ తదితర వ్యాధులు ప్రధానంగా వస్తాయని పేర్కొన్నారు. రేబీస్ చాలా ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన వ్యాధి అని ఈ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పశువైద్యశాల సిబ్బంది ప్రజలకు వీటిపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

● ఆదమరిస్తే.. ఆస్పత్రికే...!



మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట ఉన్న కల్వర్టుపై ఏర్పడిన రంధ్రం అందర్నీ కలవరపెడుతోంది. ఆదమరచి వాహనం నడిపితే నలుగురు మోసుకుని ఆస్పత్రికి తీసుకుపోవాల్సిన పరిస్థితి ఇక్కడ నెలకొని ఉంది. నిత్యం వివిధ రకాల పనులపై తహసీల్దారు కార్యాలయానికి వస్తున్న ప్రజానీకం కల్వర్టుపై ఏర్పడిన రంధ్రాన్ని జడసుకుంటున్నారు. గతంలో ఇదే ఏరియాలో రంధ్రం ఏర్పడటంతో ప్రజాప్రతినిధులు స్పందించి రంధ్రానికి మరమ్మతులు చేయించారు. సత్వరమే అధికారులు స్పందించి కల్వర్టుపై ఏర్పడిన రంధ్రానికి మరమ్మతులు చేయించి ప్రమాదం నుంచి వాహనదారులను రక్షించాలని కోరుతున్నారు. -శావల్యాపురం

చిరుద్యోగులపై అధికార పార్టీ వేధింపులు ఆపాలి

అమరావతి: అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో స్కీం వర్కర్స్‌పై వేధింపులు ఆపాలని సీఐటీయూ మండల కమిటీ కార్యదర్శి బి.సూరిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం అయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్స్, ఆయాలు, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్నం భోజనం పథకం, పంచాయతీ కార్మికులను అధికార టీడీపీ నాయకులు బెదిరించటం దారుణమన్నారు. అధికారం వచ్చిందని తమకు సంబంధించిన వారిని నియమించుకోవడానికి..ప్రస్తుతం పనిచేస్తున్న వారిని తప్పుకోవాలని బెదిరిస్తూ, మానసికంగా వేధిస్తున్నారన్నారు. అధికార పార్టీ నాయకులు పద్ధతి మార్చుకోవాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో బెదిరింపులకు గురైన అనేక మంది ఉద్యోగులు మానసికంగా కృంగిపోయి, అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో గుండె సంబంధిత వ్యాధులతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు.

కొత్త ప్రభుత్వం వస్తే తమ కోరికలు నెరవేరుతాయని, తమ హక్కులు కాపాడతారనుకుంటే.. అందుకు విరుద్ధంగా చిన్న ఉద్యోగులపై అధికార పార్టీ నాయకులు ప్రతాపాన్ని చూపడం సరికాదని హితవు పలికారు. ఇప్పటికైన టీడీపీ అగ్ర నాయత్వం కల్పించుకుని బెదిరింపులను ఆపాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): రోడ్డుపై పడిన చెట్టును గమనించక వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు కొమ్మలను ఢీకొని తీవ్ర గాయాపడిన ఘటన మండలంలోని గోళ్ళపాడు సమీపంలోని సేఫ్ ఫార్మా కంపెనీ వద్ద గురువారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సత్తెనపల్లి మండలంలోని గుడిపూడి గ్రామానికి చెందిన నూర్ బాజీవలి నరసరావుపేటలోని లిక్కర్ డిపోలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. గురువారం రాత్రి విధులు ముగించుకొని ద్విచక్ర వాహనం పై ఇంటికి వెళ్తూ.. గోళ్ళపాడు సమీపంలోని సేఫ్ ఫార్మా కంపెనీ ఎదురు రోడ్డుపై వర్షానికి పడిన చెట్టు కొమ్మలను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో నూర్ బాజీవలి తలకు తీవ్ర గాయం కావటంతో చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరులోని ప్రవేటు వైద్యశాలలో చేర్పించారు.